కథానిక



# జీవనది

**- జ్యోతి శ్రీనివాస్**

ఖైరతాబాద్ రైల్వే స్టేషన్ పక్కగా కట్టిన ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద చోటు చేసుకున్న రేకుల షెడ్ల దగ్గరకు చేరారు వాళ్ళిద్దరూ...

"అనసూయా" అన్న పిలుపుకు సుమారు ముప్పై సంవత్సరాల వయసున్న ఆమె, రేకుల గోడకు వేలాడదీసిన పోలిథీన్ సంచీల కర్టెన్ తొలగించి చూసింది.

సోమయాజులూ, అతడి తోటి వచ్చిన యువకుడూ, ఆ షెడ్‌లోకి అడుగు పెట్టారు. అప్పుడప్పుడే సంధ్య చీకట్లు ముసురుకుంటున్నాయి. ఆ షెడ్‌కి పైకప్పు లేదు. ఎత్తుగా ఉన్న బ్రిడ్జి తాలూకు సీలింగ్ పైకప్పు దూరంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఎదురుగా వెలుగుతున్న నియాన్ లైట్ల వెలుతురు, పై నుండి షెడ్‌లో పల్చగా పరుచుకుంటోంది. ఎలక్ట్రిసిటీ లేని లోటు తీరుస్తోంది.

"కూచో! ఎంత సేపలా నిలబడుంటావు."

దిక్కులు చూస్తున్న యువకుడు తలవంకించి సోమయాజులు పక్కనే చతికిలబడ్డాడు.

"ఇతని పేరు నారాయణ" భార్యకి పరిచయం చేసాడు.

"మన ఏసోబు ఇంట్లో ఉండమన్నాను" ఆమె అభిప్రాయం కోసం చూసినట్లుగా ఆగాడు. ఆమె ఏమీ జవాబియ్యలేదు. ఓసారి ఓరగా నారాయణ వైపు మాత్రం చూసింది.

సోమయాజులు లేచాడు. అతనితోపాటు నారాయణ కూడా. ప్రక్కనే ఉన్న మరొక రేకుల షెడ్‌లోకి వెళ్ళాక...

"ఇదిగో!... అబ్బాయ్!... ఇక నుంచి ఈ గది నీది ఇక్కడే ఉండు. ఏం కావాలన్నా అడుగు" సోమయాజులు వెళ్ళిపోయాడు. నారాయణ ఒక్కడే ఆలోచనా సముద్రంలో కొట్టుకుపోతూ, రెండు మోకాళ్ళమీదా తల పెట్టుకొని కూచున్నాడు.

లుంబినీ పార్క్ దగ్గర హుస్సేన్ సాగర్ రైలింగ్స్ ఆనుకొని, సగం నిద్ర, సగం మెలుకువతో నీరసంగా జోగుతున్న నారాయణ.

"ఎవరదీ" అన్న కేకకు ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు.

"నే నే" చాలా నీరసంగా వచ్చింది సమాధానం.

"నేనంటే? నీ పేరేంటి" వివరం అడిగాడు సోమయాజులు.

"నారాయణ" తలదించుకునే అన్నాడు.

"ఇక్కడేం చేస్తానన్నావు? కూడు తిన్నావా? పొద్దుటేల నుంచి సూత్తన్నాను, అంగుళం కదల్లేదు, డబ్బు ల్లేవా?"

సమాధానంగా కళ్ళల్లో తిరిగిన నీరు చొక్కా అంచులకు తుడుచుకున్నాడు నారాయణ. సాయంత్రం రద్దీ మొదలవడానికి ముందే ఇంటికెళ్ళి కూడు తినేసి రావడం సోమయాజులు దిన చర్య. ఈరోజు వంటరిగా కాకుండా, నారాయణను తీసుకొని ఇంటికి చేరాడు.

'సోమయాజులు' రూపాన్ని బట్టి పేరును ఊహించలేం, పేరుని బట్టి మనిషినీ పోల్చుకోలేం. ఏ పుల్లయ్యో, ఎల్లయ్యో, ఎంకన్న లాంటివి అతడి రూపానికి సరిపడే పేర్లలా తోస్తాయి. లుంబినీ పార్క్ ఏరియాలో వేపిన అటుకులు, శనగలు, ఉల్లిపాయలు కలిపి నిమ్మరసం చిలకరించి అమ్ముతుంటాడు. భార్యా కూతురూ తప్ప వేరే ఎవరూ లేరు.

"ఎలా పడుకొంటావు? ఈ గదిలో

సామానేం లేదు. ఉండు నాకాడ గోనెనంచీ లుండాల నూత్తాను" అంటూనే మూడు గోనె నంచులతో ప్రత్యక్షమయింది పక్క షెడ్‌లోనే ఉంటున్న సీతాలు. మొహమాటంగానే తీసుకున్నాడు. రెండు పక్క పరుచుకుని, ఒకటి కప్పుకునేదానికి ఉంచుకున్నాడు.

"ఈ ఇంట్లో ఇంతకు ముందు ఏసోబు, అనే కుష్టు రోగపోడు ఉండేవాడు. ఆడు నచ్చిపోయి పావం! నెలవుతుంది" చెప్పింది సీతాలు.

నారాయణకు ఒళ్ళంతా ఒక్కసారి జలదరించింది.

కంగారు పడకులే. ఆడి సామాన్లన్నీ తీసి మున్సిపాల్టీ బండిలో ఏసేసి, గదంతా ఫినాల్‌తో కడిగించుకున్నాడు యాజులు మావ చెప్పుకుపోతోంది సీతాలు.

"ఈ అనసూయత్త నోటికీ, ఈడి చేతి వాటానికీ జడిసిగాని, లేకపోతే ఈపాటికి ఈ గదిలో ఎవరో ఒకరు చేరిపోయేవారే- మరి నిన్నెట్టా రానిచ్చాడబ్బా?" అనుమానపడింది సీతాలు.

"నెలకి పది రూపాయలు అద్దె కట్టమన్నాడు, ఉత్తినే ఏమివ్వలేదు."

సీతాలు కళ్ళల్లో ఆశ్చర్యం తొంగి చూసింది.

"అయినా ఇప్పుడే కాదులే, నాలుగు డబ్బులు సంపాదించాక ఒక్కసారే లెక్క చూసి ఇమ్మన్నాడు" ఆవలిస్తూ అన్నాడు నారాయణ.

"నిద్రొస్తందేమో! పడుకో తరువాత పలకరించుకోవచ్చులే" అంటూ వెళ్ళిపోయింది.

ఆలోచనల్లో ఎప్పుడు నిద్ర పట్టిందో కూడా తెలియదు. గాఢ నిద్రలో మునిగిపోయాడు నారాయణ.

"అమ్మ అయిదు రూపాలు అడక్కరమ్మంది" అన్న పిలుపుకు ఉలిక్కిపడి లేచాడు.

నీలం రంగు పరికిణీ, పసుపు జాకెట్టు, కొత్తగా వేసుకుంటున్నట్టుగా తెలుస్తున్న ఎర్ర ఓణీ- మొత్తంగా కాంట్రాస్టు కలర్స్. ఎక్కడా మేచింగ్ కలపట్లేదు. అయినా పయసు వల్ల వచ్చిన గ్రేస్‌ఫుల్‌నెస్‌తో మొహంలో ఏదో ఆకర్షణ. సోమయాజులు కూతుర్ని గుర్తుపట్టాడు.

ఏమిటీ ఆలస్యం? అన్నట్లు చిరాగ్గా మొహం పెట్టింది.

"అంత ఉండదనుకొంటా- ఉండు నూత్తాను" జేబులు వెదికి ఒక రూపాయి కాగితం మూడు అర్ధరూపాయలు రెండు పావలాలు- చిల్లర ఆమె దోసిట్లో పోసాడు.

"బంఛా కావాలా? ఇప్పుడే సెప్పాల, మల్లా కాశీం సాయబ్బు ఎల్లిపోతే దొరకదు."

అతడికి ఆమె మాటలు అర్థం అయ్యాయో లేదో కూడా తెలియదు. అతడు ఆ కంగారులోంచి తేరుకునేలోపే తుర్రున పరుగుతీసింది.

బయట ఉన్న మట్టి గోలెంలోంచి నీళ్ళు దోసిలితో తీసుకొని, నోరూ, మొహం కడుక్కున్నాడు. బ్రిడ్జి కింద నుంచి ఏటవాలుగా సూర్య కిరణాలు పడుతున్నాయి. బ్రిడ్జి మీద సందడి మొదలయింది.

మాలక్ష్మి ఒక చేత్తో బన్ రొట్టె, ఇంకో చేత్తో కాలకుండా పరికిణీతో పట్టుకున్న సత్తు గ్లాసులో టీ తీసుకొచ్చింది. అది తింటుండగానే సోమయాజులు వచ్చాడు.

"ఏం! రాత్రి సరిగా నిద్రపోలేదా?"

"ఏం నిద్రో- లోపలేమో దోమలు, పక్కనే రైళ్ళు, పైన బ్రిడ్జి మీద బస్సులు, స్కూటర్లు- నిద్రెక్కడా" నిన్న టిదాకా ఫుట్‌పాత్ మీదున్న విషయం మర్చిపోయినట్టే మాట్లాడాడు.

అదేదో పెద్ద జోక్‌లా పగలబడి నవ్వాడు సోమయాజులు.

"అంతేలే! నాల్రోజులుంటే అదే అలవాటవుతాది" సోమయాజులు మాట కూడా యానగానే మాట్లాడతాడు.

సోమయాజులు అక్కడే పుట్టాడు. ఏ అగ్నిహోత్రీకుడు కన్న బిడ్డో- చివరికి ఈ బ్రిడ్జి కిందకి చేరి ఇక్కడే కన్ను మూసింది, అతడి తల్లి. వెళ్తూ వెళ్తూ తన వారసత్వంగా సోమయాజుల్ని బ్రిడ్జి కింద వదిలి వెళ్ళింది. అక్కడే పెరిగాడు, పెద్దవాడయ్యాడు.

సోమయాజులు భార్య అనసూయది కోనసీమలో ఏదో పల్లెటూరు. హైదరాబాద్‌లో ఎలక్ట్రీషియన్ పని చేసే వెంకట్రావుతో ప్రేమలో పడింది. అతనితో హైదరాబాద్ పారిపోయి వచ్చింది. ఏడాది బాగానే గడిచింది. మాలక్ష్మి కడుపులో పడ్డ ఏణ్ణెల్లకి వెంకట్రావు కరెంటు ప్రమాదంలో చచ్చిపోయాడు. అద్దె కూడా కట్టలేని ఆర్థిక పరిస్థితి అనసూయను రోడ్డు మీదకి నెట్టింది. అదిగో అప్పుడే తలదాచుకోడానికి బ్రిడ్జి కిందికి చేరింది. తోడు కోసం పెళ్ళికాని సోమయాజులుతో కాపురం పెట్టింది. సోమయాజులు దురదృష్టమో, మాలక్ష్మి అదృష్టమో అనసూయ కింక పిల్లలు కలగలేదు. సోమయాజులు దాని గురించి బాధపడనూ లేదు.

రైలు చక్రాల కిందపడి నలిగిపోయిన ఐదు పైసల బిళ్ళలాగా, చతురస్రాన్ని ఎదురు బొదురు కోణాలు పట్టుకుని సాగతీస్తే ఎలా ఉంటుందో- అలా ఉంటుంది, మాలక్ష్మి మొహం- సన్నగా పొడుగ్గా.

"జల్ది తాగు, సల్లారిపోతాది" అదిలింపుగా అంది.

"నువ్వు తాగావా?" మొహమాటంగానే అడిగాడు. అదే జీవితంలో మొదటిసారి, పరాయిస్త్రీని "నువ్వు" అని పిలవడం.

ఏదో విచిత్రంగా, థ్రిల్లింగ్‌గా అనిపించింది.

"జల్ది తాగు- పేసింజరొత్తాది, ఏవుపుల్లలమ్ముదాం, సీతాలు కొడుకులు అప్పుడే ఎల్లిపోయారు" తొందరచేసింది.

నారాయణకు ఒక్క ముక్క అర్థం కాలేదు. అర్థం కాలేదనడానికి మనసొప్పలేదు. అందుకే బన్ రొట్టె తిని, టీ పూర్తి చేసి, మాలక్ష్మి వెనుకే బయల్దేరాడు. వేప పుల్లల కట్ట ఒకటి నారాయణ చేతుల్లో ఉంచింది.

"ఏపుల్లలే ఏపుల్లలే ఏపుల్లలే" విచిత్రమైన శబ్దాలతో రాగయుక్తంగా అరుస్తూ రైలు అల్లంత దూరాన ఉండగానే తన విన్యాసాలు ప్రారంభించింది మాలక్ష్మి. అలవాటు లేకపోయినా, పరిస్థితి అర్థం కావడం వలన నారాయణ కూడా కిటికీల దగ్గర కేకలు పెడుతూ పరుగులు తీసాడు.

"ఎంతొచ్చింది?" బండి వెళ్ళిపోయాక



## 'టాబూ' పెళ్ళి పిచ్చి?

'ప్రేమదేశం, నిన్నే పెళ్ళాడతా' చిత్రాల వరుస విజయంతో కుర్రకారు గుండెల్లో గుబులును రేకెత్తించిన, అందాల పొడుగు కళ్ళ సుందరీమణి 'టాబూ'కి, ప్రస్తుతం 'పెళ్ళి పిచ్చి' పట్టుకుందని అందరూ అనుకుంటున్నారట. దివంగత నటి దివ్యభారతి భర్త సాజిద్ నడియడ్ వాలా.. టాబూల ప్రేమ వ్యవహారం బహిరంగ రహస్యమే. కాగా, అతి తొందరలోనే అతనిని వివాహమాడెయ్యాలని టాబూ తెగ తొందరపడిపోతుందట. 'మంచి సక్సెస్ హీరోయిన్‌గా కొనసాగుతున్న 'టాబూ'కి ఈ పెళ్ళి పిచ్చి ఏమిట్రా బాబూ!

పరుగుతో వచ్చి రొప్పుతూ అడిగింది. ఖాళీ చేతులు చూపించాడు. ఫక్కున నవ్వింది.

చేతిలో నాలుగు రూపాయల చిల్లర గలగల లాడిస్తూ గర్వంగా నవ్వింది. ఆమె చిరిగిన జాకెట్లోంచి తొంగిచూస్తున్న లేత యవ్వనపు పొంగులు సిగ్గుపడేలా నవ్వింది.

"బతుకు తెరువు కోసం, శానా విద్యలు నేర్చుకోవాలి." స్వగతంగా అనుకొన్నాడు.

రోజూ పొద్దుటే పాసింజరు బళ్ళకు వేపుపుల్లలు అమ్మడం రైలు పట్టాల మీద దొరికే రాక్షస బొగ్గు ఏరుకొచ్చి పల్లీల బండి వాడికి అమ్మడం. ఎక్కడో అక్కడ కూలిపన్లు చేసి ఏరోజు డబ్బు ఆరోజు తెచ్చుకోవడం నారాయణ దినచర్యగా అయింది.

రైల్వే కాబిన్ దాటాక, అవుటర్ సిగ్నల్ దగ్గర, ఆపేసి ఉంచిన గూడ్సు భోగీల్లో మాలక్ష్మి- నారాయణ ఏకాంతంలో కలుసుకుంటున్నారన్న వార్త బ్రిడ్జి కింద ప్రపంచంలో గుప్పుమంది.

"ఏమంటావు మరి?" అడిగాడు సోమయాజులు.

"అనేదేవుంది, మనువాడతానంటున్నాడు గదా!"- "ఏటంటావు- అంతేకదా" అంటూ నారాయణ కేసి చూసి నవ్వుతూ తేల్చేసింది సీతాలు. సిగ్గుపడ్డాడు నారాయణ.

సీతాలే నారాయణ తరపున పెద్దరికం వహించింది. పప్పన్నాలు వడ్డించింది. మగ పెళ్ళివారి తరపున తగవులు పెట్టుకుని బూతులు తిట్టింది- మాలక్ష్మి మకాం నారాయణ గదిలోకి మారింది.

నారాయణ కోసం సోమయాజులు కూడా కొంత ఖర్చు పెట్టి గోలీసోడాల బండి ఇప్పించాడు. ఇప్పుడు సోమయాజులు, నారాయణ కలిసే వెళతారు, కలిసే వస్తారు. సోమయాజులు బలం మరికొంత పెరిగింది, బ్రిడ్జి కింద.

నారాయణకు అద్దె బాధ లేదు.

ఒకరోజు తీరిగ్గా కూచున్నప్పుడు సీతాల్ని అడిగాడు నారాయణ- "అక్కా! నీకతేందనలు!"

విచిత్రంగా నవ్వింది సీతాలు. పెదాలు బిగించి నవ్వుతుంది. అలా నవ్వినప్పుడు తుమ్మ మొద్దులాంటి శరీరం అదిరేలా నవ్వుతుంది. ఆమె గొంతులో మార్దవం ఉండదు. ఒకరకమైన కరకుదనం ఉంటుంది.

"ఎవ్వరైనా ఏమైనా అనుకోనీ తమ్ముడూ."

"మొదట్లో రామారావనే నైటోడితో ఉండేదాన్ని. ఆడు బొగ్గులేరుకరాబోయి ఎనకాల వత్తన్న గూడ్సు బండిని కనుకోక దానికింద పడ్డాడు. ఆడు నచ్చిపోయాక ఏరే దిక్కులేకపోయింది. పిల్లలు నూత్తే సిన్నోళ్ళు. నా ఒక్కదాని రెక్కల కట్టం మీద కడుపునిండా కూడే దొరకదాయె. ఒళ్ళమ్ముకోడానికి ఇష్టం లేదు. అందుకే రైల్వే గేటు కాడ చెప్పులు కుట్టే శంకరాన్ని నమ్మాను. శంకారానికి భార్యా ఉందనుకో- పిల్లల్లేరు. అయితేనేం- నన్ను అన్యాయం సెయ్యడనే అనుకొంటున్నాను" టూకీగా చెప్పింది సీతాలు.

కాలం గడిచిపోతోంది. సోమయాజులు పోయి దాదాపు సంవత్సరం పైనే అవుతోంది. సోమయాజులు యాపారం, నారాయణ చూసుకొంటే, సోడా బండి వ్యాపారం సోమయాజులు మనవడు చూసుకుంటున్నాడు. నారాయణకు చెంపలదగ్గ వెంట్రుకలు తెల్లబడ్డాయి. ముఖంలో ముడతలు కూడా చోటుచేసుకున్నాయి.

కొడుకును అనసూయకు తోడుగా, అమ్మమ్మ దగ్గరే- సోమయాజుల షెడ్లోనే ఉంచాడు నారాయణ. గిట్టని వాళ్ళు అనలు కారణం అదికాదంటారు. నారాయణేమో నోరూ వాయీ లేని వాడు. రేపు పొద్దున్న ఆ ముసిల్ది గుటుక్కుమంటే, ఆ షెడ్ మీద అధికారం పోతుందేమోనని, ముందే కొడుకును అందులోకి చేర్చి, మాలక్ష్మి ఈ ఏర్పాటు చేసిందంటారు. మాలక్ష్మి కూతురుకు తొమ్మిదేళ్ళు వచ్చేయి. కొడుకు పదహారేళ్ళవాడు అయ్యాడు.

కన్నవాడెవ్వడో కనీసం చూడకపోయినా, సోమయాజుల్నే కన్న తండ్రిగా భావించింది మాలక్ష్మి. సోమయాజులు కూడా ఎన్నడూ ఆ తేడా కనపడనివ్వలేదు. సొంతకూతురులాగే చూసుకున్నాడు. అందుకే కొడుక్కు కోరి కోరి సోమయాజులు పేరు పెట్టుకుంది.

"రాత్రి పొద్దోయాక, పెద్దోడు కేబిన్ దగ్గరి గూడ్సు పెట్టెల కాడ్నుంచి వత్తంటే సూసాను" అన్నాడు నారాయణ.

"అయితే ఏంటుంట?" అన్నట్టు చూసింది మాలక్ష్మి.

"ఒక్కడే అయితే ఏమీ కాదు- ఆడితోపాటు సీతాలు కూతురు గౌరి కూడా ఉంది" అనలు విషయం బైట పెట్టాడు.

గతుక్కుమంది మాలక్ష్మి. అయినా ముసిముసిగా నవ్వుతూ-

"మరి మనం చేసిన పనేంటో- ఆడు నీ కొడుక్కాదా? నీ దార్లోనే నడుత్తన్నాడు" సరసమాడింది భర్తతో.

"అదికాదే- అసలే ఆసీతాలు నోరు మంచిది కాదు. అల్లరయ్యేలోగా సీతాల్తో మాటాడితే మంచిదని, నా ఉద్దేశం" బీడీపొగ వదుల్తూ చెప్పాడు.

"అట్టాగే రేపు మాటాడతాలే! అయినా అత్తకూతురేగా- వరసేలే" అంది నవ్వుతూ.

ఏ జన్మ బంధాలో, ఎక్కడి బంధుత్వాలో, అక్కడ జాతులు, కులాలు, మతాలు కనిపించవు.

అంతా మానవ కులమే. పేదరికంలో ఉన్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, స్వచ్ఛమైన మనసులు వికసిస్తాయి అక్కడ.


ఇవేమీ తెలియని చిన సోమయాజులూ, గౌరి చేతిలో చెయ్యేసుకొని గూడ్సు పెట్టెలోంచి దిగుతున్నారు.

"ఓయ్- చోంజాజులు- నాకేందో అనుమానంగుంది. మాయమ్మగ్గానీ తెలిసిందా, సంపేత్తాది. ఇప్పటికే నాకు నెల దాటిపోయిందని అనుమానంగుంది."

"మాయమ్మతో సెప్తాలే భయపడకు" హామీ ఇచ్చాడు సోమయాజులు.

వాళ్ళ నీడలు వెనుక నుంచి పడుతున్న నియాన్ లైట్ల వెలుతుర్లో పట్టాల మీద పొడుగ్గా సాగిపోతున్నాయి.

## జగపతిబాబుకి గోల్డెన్ ఛాన్స్



భీమనేని శ్రీనివాసరావు దర్శకత్వంలో జగపతిబాబు హీరోగా నిర్మించిన 'శుభమస్తు' చిత్రం మంచి హిట్ అయిన సంగతి పాఠకులకు గుర్తుండే వుంటుంది. కాగా మళ్ళీ వీరిద్దరి కాంబినేషన్‌లోనే 'శుభాకాంక్షలు' అన్న చిత్రం తయారు కానుంది. కుటుంబ తరహా చిత్రాలలో చక్కగా రాణిస్తున్న జగపతిబాబుకి, ఈ 'శుభాకాంక్షలు' చిత్రం మరింత గుర్తింపు తెస్తుందంటున్నారు.

మోడేకుర్తి సత్యనారాయణ.